

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 31 జూలై 2024



పేదల భూముల్లో వైసీపీ గద్దలు

- ఆరు నెలల్లో వేల ఎకరాల రిజిస్ట్రేషన్
- ఫ్రీ హోల్డ్‌తో వైసీపీ నేతలకు లబ్ధి
- బినామీ పేర్లతో కైవసం
- జీఓ 596 అమలు తాత్కాలికంగా నిలిపివేత
- అక్రమాలపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలవారీగా ఆరా



అసైన్డ్‌కు ఎసరు!

పుట్టపర్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు ఆ పార్టీ నాయకులకు వరంలా మారింది. ముందస్తు పక్కా ప్రణాళికతో జిల్లాలో పేదలు, మధ్యతరగతి వర్గాల అసైన్డ్ భూములను కారుచౌకగా కొట్టేశారు. అంతటితో ఆగకుండా ఫ్రీహోల్డ్ చేసిన తరువాతే రిజిస్ట్రేషన్లు చేసి, చేతులు మార్చారు. ఆరు నెలల వ్యవధిలోనే వేలాది ఎకరాల అసైన్డ్ భూములు వైసీపీ నేతలు, బడా రియల్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. అసైన్డ్ భూములపై పూర్తిగా పరిశీలించి, విచారణ చేయకుండానే ఫ్రీ హోల్డ్ (యాజమాన్య హక్కులు) కల్పించడంపై విమర్శలు వచ్చినా.. గత జగన్ సర్కార్ లెక్కచేయలేదు. సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలనే తాపత్రయంతో ముందుకెళ్లింది. వైసీపీ నేతలకు మేలు చేయాలనే ఉద్దేశంతో 2023 జూలై 31 వతేదీ నాటికి 20 ఏళ్ల ముందు అసైన్డ్ చేసిన వ్యవసాయ భూములను అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ గతేడాది అక్టోబరు 27న అప్పటి ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. దీనికి అనుగుణంగా మార్గదర్శకాల జీఓ 596 డిసెంబరులో విడుదలైంది. జీఓ విడుదలయ్యిందే తడవు జిల్లాలో అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ ప్రక్రియ వేగంగా సాగింది. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు.. రెవెన్యూ అధికార యంత్రాంగంపై ఒత్తిళ్లు తీసుకొచ్చి, తమ అనుయాయుల భూములు చకచకా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వైసీపీ నేతలు, బడా రియల్ వ్యాపారులతోపాటు అధికార యంత్రాంగంలో కొందరు బినామీల పేరుతో ముందస్తుగా కొనుగోలు చేసిన భూములకు సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లాల యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. జిల్లాల వారీగా అసైన్డ్ భూములన్నీ ఫ్రీహోల్డ్ చేపట్టాలని హుకుం జారీ చేశారు. జిల్లాలో 1,92,329 ఎకరాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించారు. గతేడాది డిసెంబరు నుంచి ఈనెల 21 దాకా భారీగా నిషిద్ధ జాబితా 22(ఏ)తోపాటు ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు జరగడం అనుమానాలకు తావిస్తోంది. వైసీపీ నేతలు చెప్పినట్లు 22(ఏ) భూములతోపాటు 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ (యాజమాన్య హక్కులు) చేయించాలని హడావుడిగా రిజిస్ట్రేషన్లు చేశారు. ఇలా.. వేల కోట్ల విలువైన అసైన్డ్ భూములు చేతులు మారిన వైనంపై ప్రభుత్వం పునఃసమీక్షించి వైసీపీ అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. జిల్లాలో అన్యాక్రాంతమైన భూములపై ఆరాతీస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది.



వైసీపీ నేతలకే లబ్ధి

20 ఏళ్లుగా అనుభవంలో ఉన్న భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తారని వైసీపీ పెద్దల ముందస్తు సమాచారంతో ఆ పార్టీ నేతలతోపాటు రియల్ వ్యాపారులు, కొందరు అధికారులు బినామీ పేర్లతో పేదల అసైన్డ్ భూముల కొనుగోలుకు ఒప్పందాలు చేసుకున్నారు. కారుచౌకగా కొనేశారు. వైసీపీ ప్రభుత్వం యాజమాన్య హక్కులు కల్పిస్తూ నిర్ణయం వెలువరించిన వెంటనే ఫ్రీహోల్డ్ చేయించి, బినామీల పేరిట రిజిస్ట్రేషన్లు కానిచ్చేశారు. ఫ్రీహోల్డ్ ఆగమేఘాలపై తీసుకువచ్చి భూములను కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో రైతుల దరఖాస్తులను అధికారులు పక్కన పెట్టి, వైసీపీ నేతలు చెప్పిన భూములతోపాటు చేయి తడిపిన వారివే ఫ్రీహోల్డ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ, కదిరి, రాప్తాడు, మడకశిర నియోజకవర్గాల్లో భారీగా అసైన్డ్ భూములు ఫ్రీహోల్డ్ చేశారు. ఇంకా వేలాదిగా దరఖాస్తులు చేసుకుని, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం, హిందూపురం ప్రాంతాల్లో వేలాది ఎకరాల అసైన్డ్ భూములు వైసీపీ పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. పేదల బతుకుదెరువు కోసం ఇచ్చిన భూములను వైసీపీ నేతలు ప్రలోభాలు, బెదిరింపులతో సొంతం చేసుకున్నారు.



వేల ఎకరాలు రిజిస్ట్రేషన్

జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భారీగా అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది. యాజమాన్య హక్కుల కల్పనకు అనుగుణంగా 596 జీఓ జారీతో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు వేగంగా చేసేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో అధికారులు కొర్రీలు పెట్టకుండా రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ మెమోలు కూడా జారీ చేశారు. దీంతో ఈఏడాది జనవరి నుంచి వేలాది ఎకరాల అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ చేశారు. కేవలం ఆరు నెలల పరిధిలో 7800 ఎకరాలకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగి చేతులు మారాయి. పెనుకొండ, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి, కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో వేలాది ఎకరాల అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ జరిగినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా తెలుస్తోంది. మరికొన్ని ఒప్పందాలు జరిగి రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్నారు. అక్రమాలకు దోహదం చేస్తోన్న జీఓ 596 అమలును తాత్కాలికంగా నిలిపివేసి, వాస్తవాలపై స్పష్టత వచ్చిన అనంతరం మార్పులు చేర్పులు చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై ప్రస్తుత ప్రభుత్వం సమాలోచనలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. నిషిద్ధ జాబితాలోని భూముల 22(ఏ) అసాధారణంగా ఆరు నెలల్లోనే రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ల శాఖ ప్రాథమికంగా జిల్లా అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. వీటన్నింటిపైనా రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ నివేదిక కోరడంతో ఆ పనిలో ఆ శాఖాధికారులు నిమగ్నమయ్యారు.



హిందూపురంలోని మాతాశిశు వైద్యశాల



- తల్లీబిడ్డకు ట్యాగ్‌లు కూడా వేయని వైనం
- నామమాత్రంగా భద్రతా సిబ్బంది
- అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు
- గస్తీని గాలికొదిలేసిన పోలీసులు

ఆస్పత్రిలో అభద్రత!

హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో భద్రత గాలికి..

హిందూపురం, జూలై 30: స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని వార్డులో నెలక్రితం భార్యాభర్తలు గొడవపడ్డారు. గర్భవతి ప్రసవం కోసం రాగా.. వారి కుటుంబ తగాదాలతో గొడవపడి అడ్మిట్ కాకుండా బయటికి వెళ్లిపోయారు. ఇది సీసీ కెమెరాలో రికార్డు కాలేదు. అక్కడ వార్డులో ఉన్న ఇతర రోగులు గమనించలేదు. మూడు నెలల క్రితం మడకశిర ప్రాంతానికి చెందిన ఓ మహిళ ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చింది. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆడబిడ్డ పుట్టడం తండ్రికి ఇష్టంలేక బిడ్డ గొంతు నొక్కడానికి ప్రయత్నించాడు. అక్కడున్న ఇతర రోగులు, బంధువులు అడ్డుకుని పంపించేశారు. మూడు రోజుల క్రితం బిడ్డను ఎత్తుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించగా.. అక్కడున్న రోగులు గమనించి పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. ఈ బెడ్‌పైన తన బిడ్డ రెండురోజుల క్రితం ఉండేదనీ, దీంతో ఆ బిడ్డను ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు చెప్పారు. అక్కడున్న రోగులు, బంధువులు అడ్డుకున్నారు. భద్రతాసిబ్బంది మాత్రం లేరు. వీటిని బట్టి హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో భద్రత ఏమేర ఉందో అర్థం చేసుకోవచ్చు.

హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో భద్రత కొరవడింది. ఇక్కడ తగినంత భద్రత ఉన్నా నిఘా కొరవడినట్లు తెలుస్తోంది. ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి. దీంతో పెద్దాసుపత్రిలో చంటి బిడ్డలను ఎత్తుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు ఎప్పుడేం జరుగుతుందోనన్న భయాందోళనల మధ్య గడుపుతున్నారు. రాత్రయితే చాలు.. ఆస్పత్రి ప్రాంగణంలో తాగుబోతులు కూడా అక్కడే మద్యం సేవిస్తున్నట్లు ఇటీవల పలుమార్లు అక్కడే ఉన్న రోగులు చూశారు. ఉమ్మడి జిల్లాలో అనంతపురం తరువాత హిందూపురంలోనే జిల్లా ఆస్పత్రి ఉంది. నిత్యం ఇక్కడికి వెయ్యి మందిదాకా ఓపీకి వస్తుంటారు. అందుకు తగ్గట్టుగా భద్రత ఇక్కడ లేదన్నది నగ్నసత్యం.

ఉన్నా.. వేస్ట్..

ప్రభుత్వాస్పత్రిలో 31 సీసీ కెమెరాలున్నాయి. వీటిలో 7 కెమెరాలు పనిచేయడం లేదు. మాతాశిశు సంరక్షణ కేంద్రంలో తొమ్మిది కెమెరాలు ఉండగా.. అక్కడ భవనాలు నిర్మాణంలో ఉండటంతో ఆరు కెమెరాలు పనిచేయడంలేదు. ఉన్న మూడు కెమెరాలు సైతం ఎప్పుడు పనిచేస్తాయో వాటికే ఎరుక. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్పత్రిలో ఏదైనా జరిగితే సాక్ష్యాలు లేకుండా పోయే ప్రమాదం ఉందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఆస్పత్రి ఉంది. అర్ధరాత్రి వరకు జనాలు తిరుగుతూనే ఉంటారు. ఆస్పత్రికి మూడు వైపులా రహదారులున్నాయి. ప్రధాన ద్వారాలతోపాటు మాతాశిశు కేంద్రం వద్ద మరో గేటు ఉంది. చీకటి పడితే ఎవరు వెళ్తున్నారో.. ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి. ప్రధాన గేట్ల వెలుపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రాంగణంలోనే కెమెరాలు ఉండటం, అవి కూడా పనిచేయకపోవడంతో ఇక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చీకటి పడితే ఇక్కడికి ఎవరు వస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో అనేదానిపై నిఘా లేదు. ఈ పరిస్థితుల్లో ఆస్పత్రిలో భద్రతను వైద్యులు, సిబ్బంది గాలికి వదిలేశారన్న ఆరోపణలున్నాయి.



మాతాశిశు కేంద్రంలో ఉన్న సీసీ కెమెరా



చిన్నారి చేతికి కనిపించని ట్యాగ్

గస్తీ ఎక్కడ?

ప్రభుత్వ ఆస్పత్రిలోని వార్డు బయట, ఆస్పత్రి ఆవరణలో నిద్రించేవారిపై నిఘా లేకపోవడం, ఎవరంటే వారు వార్డుల్లోకి ప్రవేశించడం, రాత్రిపూట పోలీసు గస్తీ లేకపోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రభుత్వాస్పత్రికి కొంతమంది పోలీసు సిబ్బందిని కేటాయిస్తారు. ఇక్కడున్నవారు రాత్రి 9 గంటల వరకు మాత్రమే ఆస్పత్రిలో ఉంటారు. ఆ తరువాత ఇళ్లకు చేరుకుంటారు. రాత్రిపూట ఆస్పత్రిలో ఏఎస్ఐతోపాటు ఒక పోలీసు ఉండాలి. వారు రాత్రంతా ఆస్పత్రి, వార్డుల్లో గస్తీ తిరగాలి. హిందూపురంలో పోలీసులు ఆ ఊసే మరిచారు. ఆస్పత్రిలో డ్యూటీకి మాత్రం ఎగబడతారు. రాత్రిపూట బందోబస్తుకు మాత్రం పత్తాలేకుండా పోతారు. దీంతో ఆస్పత్రిలో రాత్రిపూట కొన్ని అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయి.

సిబ్బంది.. ఇతర సేవలకు?

ప్రభుత్వాస్పత్రిలో భద్రతా సిబ్బంది తమ విధులను పక్కనబెట్టి, ఉన్నతాధికారులు, వైద్యుల సేవలో తరిస్తుంటారన్న విమర్శలున్నాయి. అసలే ఆస్పత్రికి చాలినంత మంది భద్రతా సిబ్బంది లేకపోవడం, ఉన్నవారు కూడా ఇతర పనులు చేస్తుండటంతో రోగులు రద్దీగా ఉండే సమయంలో ఏం జరుగుతుందో సెక్యూరిటీ సిబ్బందికే తెలియకుండా పోతోంది.

ట్యాగ్‌లు ఉన్నా.. ఫలితం ఏదీ?

ప్రభుత్వాస్పత్రిలో చిన్న పిల్లలను ఎత్తుకెళ్తున్నారని గుర్తించి గత టీడీపీ హయాంలో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ డివైజ్ (జియోట్యాగ్) అమలులోకి తెచ్చారు. ప్రసవమైన వెంటనే తల్లి, బిడ్డ చేతులకు ట్యాగ్‌లను అమర్చుతారు. తల్లికి వంద అడుగులకంటే దూరంలోకి బిడ్డను తీసుకెళ్తే ఈ పరికరం శబ్దం చేస్తుంది. దీంతో వార్డు నుంచి వేర్వేరుగా తల్లీబిడ్డ బయటికి వచ్చే అవకాశం ఉండదు. ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లడం అసాధ్యం. హిందూపురం ఆస్పత్రిలో జియోట్యాగ్ అమలులో ఉందని వైద్యులు చెబుతున్నా.. ఇటీవల జరిగిన ఘటనలో ట్యాగ్ లేకపోవడం గమనార్హం. ట్యాగ్‌ల సైరన్ రాకపోవడంతో అందుకు సంబంధించిన బ్యాటరీ పనిచేయట్లేదని తెలిసింది. దీనిపై విమర్శలు రావడంతో బ్యాటరీ ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

భద్రతపై దృష్టి పెట్టాం

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భద్రతపై దృష్టి పెట్టాం. కొన్ని వార్డుల్లో సీసీ కెమెరాలు పనిచేయట్లేదు. వాటిని పరిశీలించాం. ఒక రెండు రోజుల్లో వాటికి మరమ్మతులు చేయిస్తాం. తల్లీబిడ్డలకు తప్పనిసరిగా జియోట్యాగ్ ఏర్పాటుచేసి, వీటి పర్యవేక్షణకు మహిళా సిబ్బందిని నియమిస్తాం.

- రోహిల్‌కుమార్, సూపరింటెండెంట్

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.90.73 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కదిరి, జూలై 30: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. మొత్తం 60 రోజులకుగాను నగదు రూపేణా రూ.90.73 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బంగారు 23.750 గ్రాములు, వెండి 310గ్రాములు, విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారి రమేష్‌బాబు, ఎస్‌బీఐ మేనేజర్ హరిప్రసాద్, ఆలయ, బ్యాంకు సిబ్బంది, సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల కోసం సమయం కేటాయించాలి: మంత్రి




బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, జూలై 30: ఎంత బిజీగా ఉన్నా.. క్రీడల కోసం కాస్త సమయం కేటాయించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం బ్యాడ్మింటన్ ఆడుతూ కనిపించారు. ఉదయాన్నే స్థానిక గీతానగర్‌లోని ఇండోర్ స్టేడియానికి చేరుకుని, అక్కడ షట్లర్లతో కలిసి కాసేపు బ్యాడ్మింటన్ ఆడారు. అనంతర ఆయన మాట్లాడుతూ.. మంత్రిగా ఎంత బిజీగా ఉన్నా సమయం దొరికినపుడల్లా క్రీడలు ఆడతానని తెలిపారు. తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతిఒక్కరూ కాసేపు క్రీడల కోసం కేటాయించి, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆయన సూచించారు.

ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్‌కు స్థానచలనం

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి బదిలీ



డాక్టర్ జాన్సన్

పుట్టపర్తి రూరల్, జూలై 30: జిల్లాకేంద్రంలోని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్‌కు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతిగా నియమించింది. ఆయన కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పరిశోధన కేంద్రాల విస్తరణ విభాగాల అధిపతిగా వ్యవహరించనున్నారు. జిల్లాల్లో సాగుచేసే పంటలు, వాటిపై పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలను సమీక్షించనున్నారు. ఆయన స్థానంలో ఏరువాక కేంద్రం అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా ఉన్న రామసుబ్బయ్యను నియమించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కొత్తచెరువు, జూలై 30: జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యాశాఖ ఏడీ లాజర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ప్రవేశానికి 14 ఏళ్లు, ఇంటర్‌లో చేరడానికి పది ఉత్తీర్ణులైన, 15 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగస్టు 27వ తేదీలోగా దరఖాస్తు పంపాలన్నారు. అడ్మిషన్ ఫీజు ఆగస్టు 28లోగా చెల్లించాలని ఆయన తెలిపారు. ఆ తర్వాత సెప్టెంబరు 4వ తేదీ వరకు రూ.200 రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బోదెల సాగు.. సులభదాయకం: ఏడీఏ

తాడిమర్రి, జూలై 30: బోదె పద్ధతిలో మొక్కజొన్న సాగు సులభదాయకమని ఏడీఏ విద్యావతి పేర్కొన్నారు. మండలంలోని నిడిగల్లుకు చెందిన రైతు హేమంత్ సాగుచేసిన మొక్కజొన్న, కంది పంటలను ఏడీఏ మంగళవారం పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటను డ్రిప్ ద్వారా కాకుండా బోదెల పద్ధతిలో సాగుచేస్తే మొక్కల సాంద్రత పెంచడమేకాక నీటివసతి, ఎరువుల వాడకం సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో ధర్మవరం ఏడీఏ క్రిష్టయ్య, ఏఓ రమాదేవి, డీఆర్‌సీ ఏఓ అబ్దుల్ అలీ, గ్రామ సర్పంచ్ నాగభూషణ పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఇతర వ్యవసాయ అధికారులు

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న దక్షిణాఫ్రికా బృందం



డీపీఎం లక్ష్మానాయక్

పంటలను పరిశీలించిన దక్షిణాఫ్రికా ప్రతినిధులు

పెనుకొండ రూరల్, జూలై 30: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగుబడులు సాధించి లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మండలంలోని శెట్టిపల్లి రైతులు సాగుచేసిన ప్రకృతి వ్యవసాయ పంటలను దక్షిణాఫ్రికా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ మైకేల్ విలియమ్స్, విస్వాక్‌సక్కార్ మంగళవారం పరిశీలించారు. రైతు బాలూనాయక్ సాగుచేస్తున్న వంగ, మిరప పంటలను పరిశీలించారు. సాగు విధానం, దిగుబడి, ఆదాయంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. వారికి డీపీఎం వివరాలు వెల్లడించారు.

చదువుకుంటే చాలు.. అన్నీ ఫ్రీ

- ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు
- బుక్కుల కోసం గతంలో నానా అవస్థలు
- కూటమి ప్రభుత్వ పాలనలో బ్యాగులు సైతం ఉచితం
- ఒక్కో విద్యార్థికి 12 నోట్ పుస్తకాలు పంపిణీ

అనంతపురం విద్య, జూలై 30: గత ప్రభుత్వాలు ఏపీ ఇవ్వని రీతిలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తోంది. వాటితోపాటు నోట్ పుస్తకాలు, బ్యాగులను సైతం అందిస్తోంది. దీంతో ఆయా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఇంటర్‌లో ఫస్ట్ ఇయర్‌లో 7807 మందికి, సెకెండ్ ఇయర్‌లో 6625 మందికి మొత్తంగా జిల్లాలో 14,432 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న డీవీఈఓ ఇతర అధికారులు

జిల్లాలో 14432 మందికి..

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఏపీ మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ కళాశాలల్లో చదివే ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ విద్యార్థులకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. ఇంటర్ మొదటి ఏడాదిలో 7807 మంది, రెండో ఏడాదిలో 6625 మంది ఉన్నారు. అనంతపురం మండలానికి 11,296 పుస్తకాలు, ఆత్మకూరు 956, బెళుగుప్ప 694, బొమ్మనహాళ్ 3272, బ్రహ్మసముద్రం 552, బుక్కరాయసముద్రం 155, డీ హీరేహాళ్ 666, గార్లదిన్నె 997, గుత్తి 3346, గుమ్మఘట్ట750, గుంతకల్లు1814, కళ్యాణదుర్గం 4480, కంబదూరు 562, కణేకల్లు 3597, కూడేరు 510, కుందుర్పి 1931, నార్పల 1731, పామిడి 3158, పెద్దపప్పూరు 684, పెద్దవడుగూరు 456, పుట్లూరుకు 1120, రాప్తాడుకు 1466, రాయదుర్గం 8247, శెట్టూరుకు 1204, శింగనమలకు 702, తాడిపత్రికి 2562, ఉరవకొండ 5250, వజ్రకరూరు 734, విడపనకల్లు 1093, యాడికి 1180, యల్లనూరుకు 1104 కిట్లు పంపిణీ చేశారు. అలాగే 75 కళాశాలల పరిధిలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు కూడా ఉచితంగా ఇవ్వనున్నారు. ఒక్కో విద్యార్థికి 12 నోట్ పుస్తకాలను అందిస్తారు. ఇందులో 6 రూల్డ్, 6 అన్ రూల్డ్ నోట్ పుస్తకాలు అందించనున్నారు. మొత్తంగా 1,73,184 నోట్ పుస్తకాలను అందించనున్నారు.

వేలాది విద్యార్థుల్లో ఆనందం

గతంలో జగన్ ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు కూడా అందించకుండా రాక్షసంగా వ్యవహరించింది. కొత్త ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుని వేలాది ఇంటర్ విద్యార్థులకు ఆనందం కలిగించింది. ఇప్పటి వరకూ పాఠశాల విద్యార్థులకు మాత్రమే విద్యా కానుక కిట్లు అందించేవారు. కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులకు ఆ పుస్తకాల కల తీర్చాలని అనుకుంది. ఈక్రమంలోనే విద్యార్థులకు ఉచితంగా బ్యాగు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తోం ది. పుస్తకాలు, బ్యాగు, నోట్ పుస్తకాల కోసం ఖర్చు చేసే వేల రూపాయలను ప్రభు త్వం మిగిల్చిందంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బుక్స్ కొనే బాధ తప్పింది..



కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌తో పాటు, టెక్స్, నోట్ బుక్కులు అందుతున్నాయి. జిల్లాలో మొదటి, రెండో ఏడాదిలో చదువుతున్న 14432 మంది విద్యార్థులకు ఈ ఏడాది టెక్స్ బుక్స్ 66,269, నోట్ బుక్స్ 1.73 లక్షలు అందిస్తున్నారు. బుక్స్ కొనాల్సిన బాధ విద్యార్థులకు తప్పింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉచితంగా కిట్లు అందుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

\- వెంకటరమణ నాయక్, డీవీఈఓ, ఆర్ఐఓ.

గత ప్రభుత్వంలో పాత పుస్తకాలే గతి



గతంలో ఐదేళ్లు విద్యార్థులకు పాత పుస్తకాలే గతి. మా సీనియర్లను అడిగి బుక్కులు ఇప్పించుకునేవాళ్లం. అవి కూడా కొందరికే దక్కేవి. దీంతో మేము అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇస్తుండటంతో ఆనందంగా ఉంది.

-ప్రియదర్శిని, బైపీసీ విద్యార్థిని, అనంతపురం

అన్నీ ఉచితంగా ఇస్తున్నారు..



ఈ ఏడాది విద్యార్థులకు అన్నీ ఉచితంగా ఇస్తున్నారు. నోట్ బుక్స్ సైతం 12 అంది స్తున్నారు. గత ప్రభుత్వం కనీసం పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేదు. పేద విద్యార్థులు పుస్తకాల కోసం పడని ఇబ్బందులు లేవు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం విద్యార్థులకు వీటిని అందించడం సంతోషంగా ఉంది.

\- సుజాతాబాయి, సెకెండ్ ఇయర్ విద్యార్థిని

కొనాల్సిన పనిలేదు



నేను ఫస్ట్ ఇయర్ చదివేటప్పుడు బుక్‌స్టాల్‌లో పుస్తకాలు కొన్నాం. పాఠ్యపుస్తకాలకే రూ. 600 పైగా ఖర్చు అయ్యింది. చాలా మంది విద్యార్థులు కొనలేని పరిస్థితి ఉంది. ఇప్పుడు ప్రభుత్వం ఉచితంగా నోట్ బుక్స్, టెక్స్ బుక్స్‌తోపాటు బ్యాగ్ కూడా అందిస్తోంది. వేలాది విద్యార్థులకు బుక్స్ కొనాల్సిన భారం తగ్గింది.

\- పర్వీన్, సెకెండ్ ఇయర్ హెచ్ఈసీ విద్యార్థిని.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి

మంత్రి పయ్యావుల కేశవ్




ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్, టీడీపీ నాయకులు, అధికారులు

మడకశిర/ రూరల్, జూలై 30: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గుండుమల పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం గుండుమలకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం పరిశీలించారు. హెలీప్యాడ్, ముఖ్యమంత్రి పాల్గొననున్న సభా వేదికలను పరిశీలించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. ఈకార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఈవేదిక ఉత్తమమైనదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హంగు, ఆర్భాటాలు ఉండవ్..

ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొంటారని మంత్రి పయ్యావులకేశవ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చిన ఆయన గుండుమలలో విలేకరులతో మాట్లాడారు. సాదాసీదాగా ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేకుండా జన సామాన్యంతో మమేకమయ్యే విధంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. గ్రామాల్లో ఉన్న వివిధ రకాల సమస్యలను తెలుసుకొంటూ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు రూపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంతకు ముందులాగా ఆర్భాటంగా బస్సుల్లో, లారీల్లో ప్రజలను తరలించే కార్యక్రమానికి స్వస్తిచెప్పి ఎక్కడికి వెళతారో అక్కడి ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకొనే ప్రయత్నం చేస్తారన్నారు.

రేపు మధ్యాహ్నం రానున్న సీఎం చంద్రబాబు



పుట్టపర్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీసత్యసాయి జిల్లా పర్యాటన ఖరారైంది. ఆగస్టు1న మడకశిర మండలం గుండుమలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటన ముగించుకుని శ్రీశైలం సున్నిపెంట నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.45కి గుండుమల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 2.15కి హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన గుండుమలకు చేరుకుంటారు. 2.20కి గుండుమలలో ఇంటి వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అనంతరం మల్బరీ ప్లాంటేషన్ షెడ్‌ను సందర్శించి పట్టు రైతులతో మాట్లాడతారు. 3.20కి గుండుమలలో కరియమ్మదేవి దేవాలయాన్ని సందర్శించి 3.25 నుంచి 4.25 దాకా గ్రామ ప్రజలతో ప్రజావేదిక కార్యక్రమంలో ముఖాముఖీ నిర్వహిస్తారు. 4.25 గుండుమల నుంచి బయల్దేరి పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. 5.05కు ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్తారు.

పింఛన్ పంపిణీకి మండలానికో ప్రత్యేక అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఓబుళమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30: పింఛన్ల పంపిణీకి మండలానికో ప్రత్యేక అధికారిని నియమించినట్లు డీఆర్‌డీఏ వెలుగు పీడీ ఓబుళమ్మ తెలిపారు. తన చాంబర్‌లో ఏపీడీ ఈశ్వరయ్యతో కలిసి ఆమె మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఆగస్టు ఒకటి ఉదయం 6గంటల నుంచి ఇంటివద్దనే పింఛన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆయా గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది బుధవారం బ్యాంకుల్లో నగదు డ్రా చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. మండలానికి, మున్సిపాలిటీకి పింఛన్‌ల పంపిణీకి ప్రత్యేక అధికారిని నియమించామని, ఆయా మండల ఎంపీడీఓలు, ఆయా మున్సిపాలిటీ కమిషనర్లను సమన్వయం చేసుకుని పర్యవేక్షిస్తారని తెలిపారు. సమావేశంలో డీపీఎంలు రాధారాణి, ఎంకే సత్యనారాయణ, జిలాన్, మజ్జిగ సత్యనారాయణ, అజ్మతుల్లా, రవీంద్రబాబు, జేడీఎం సూర్యనారాయణ, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి



పరేడ్‌ను పరిశీలిస్తున్న కమాండెంట్

అనంతపురం క్రైం,జూలై 30: ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని రాయలసీమ రీజియన్ ఇన్‌చార్జ్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లాలోని హోంగార్డులు మంగళవారం పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో కమాండెంట్ ముఖ్య అతిథిగా పాల్గొని పరేడ్ తనిఖీ చేశారు. అనంతరం హోంగార్డులను ఉద్దేశించి మాట్లాడారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండాలని, హోంగార్డులు దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవన్నారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలు, సాధక బాధకాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టండి

ఎమ్మెల్యే పరిటాల సునీత



ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పనులు చేయకుండా మొండికేసిన కాంట్రాక్టర్లతో పనులైనా చేయించండి లేకుంటే వారిని బ్లాక్‌లిస్టులో పెట్టండి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిలిచిపోయిన పనులు, తాగునీటి సమస్య ఇతరత్రా అంశాలపై సమీక్షించారు. నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మకూరు బీసీ కాలనీ, అనంతపురం నగర శివారు ప్రాంతాలు పాపంపేట, కక్కలపల్లి కాలనీ పంచాయతీల పరిధిలోని కాలనీల్లో తీవ్ర తాగునీటి సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వైసీపీ హయాంలో చేపట్టిన తాగునీటి పథకాలకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయన్నారు. ఆ నేపథ్యంలోనే తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. కూడేరు మండలం చోళసముద్రం గ్రామ పరిధిలో 1.2 కి.మీ, హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ క్రాస్ కోసం 200 మీటర్లు, ఎన్‌హెచ్ క్రాస్ కోసం 500 మీటర్లు, ఆత్మకూరు బైపాస్ క్రాస్ కోసం 100 మీటర్లు చొప్పున మొత్తం 2 కి.మీ పైపులైన్ పనులు ఆగిపోయాయన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, చోళసముద్రం గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి అక్కడ పెండింగ్‌లో ఉన్న 1.2 కి.మీ పైపులైన్ పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఆత్మకూరులో రోడ్లను ధ్వంసం చేసి నాసిరకంగా తాగునీటి పైపులైన్ పనులుచేపట్టి కొళాయిలు బిగించారన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు తెచ్చేలా ఒక ప్రత్యేక స్కీమ్‌ను తయారు చేయాలని ఆమె ఆదేశించారు. పెండింగ్ పనులకు నిధులు కోసం సీఎంతో పాటు జిల్లా కలెక్టర్‌ను కలిసి అడుగుతామన్నారు. ఉపాధి పథకం ద్వారా ప్రతి మండలంలో రూ. 3 కోట్లతో రోడ్లు వేసే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరై, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అతడి సోదరులు ముడుపుల కోసం ఆపిన 35 రోడ్ల పనులు ప్రారంభించాలని ఆదేశిం చారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఈ మల్లికార్జున, డీఈ రహేనవజీం, పంచాయతీ రాజ్ ఎస్ఈ కేఆర్ ప్రసాద్, డీఈలు రసూల్, రామచంద్రారెడ్డి, ఈఈ చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

18 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 30: జిల్లాలోని 18 మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా శింగనమలలో 13.8 మి.మీ వర్షపాతం నమోదైంది. గార్లదిన్నె 12.2, అనంతపురం 10.2, శెట్టూరు 8.4, కూడేరు 5.8, వజ్రకరూరు 5.2, నార్పల 4.6, బొమ్మనహాళ్ 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.8 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

చీనీ టన్ను రూ.16వేలు



అనంతపురం రూరల్, జూలై 30: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16,500లు, కనిష్ఠంగా రూ.2,500లు, సరాసరి రూ.11,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 680టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, జూలై 30: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 1550 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి 'ఓపెన్' అడ్మిషన్లు

అనంతపురం విద్య, జూలై 30: ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌కు సంబంధించి 2024-25 ఏడాదికి బుధవారం నుంచి అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్ల స్వీకరణకు ఓపెన్ డైరెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. పదో తరగతిలో చేరడానికి 14 ఏళ్లు నిండిన వారు, ఇంటర్‌లో చేరడానికి 10వ తరగతి పాసై 15 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. బుధవారం అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. ఆగస్టు 27లోపు ఆన్‌లైన్ అడ్మిషన్లకు చివరి గడువని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు చెల్లించడానికి ఆగస్టు 28వ తేదీ గడువని తెలిపారు. అక్టోబరు 4 వరకూ రూ.200 లేట్ ఫీజుతో ఆన్‌లైన్ అడ్మిషన్లు చేయవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను లేదా... సమీపంలోని ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్లను సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం, జూలై30: రానున్న ఐదు రోజుల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని రేకులకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. గాలులు గంటకు 12-16 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి: విజయ్‌శంకర్‌బాబు, ప్రధాన శాస్త్రవేత్త

ఉమ్మడి జిల్లాలో కంది, వేరుశనగ, ఆముదం పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు సూచించారు. కంది పంటలో మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీలు, ఆముదంలో 60 సెం.మీ దూరం ఉండేటట్లు రైతులు చూసుకోవాలన్నారు. అంతర సేద్యము ద్వారా కలుపు నివారించుకోవాలని సూచించారు. రైతులు వర్షాధార వేరుశనగ పంటలో నీటి సంరక్షణ, సాళ్లను, తల్లి సాళ్ల లేదా గొడ్డు సాళ్ల ప్రతి 3.6 మీటర్లకు ఒకటి చొప్పున విత్తన సమయం లేదా విత్తిన 20-30 రోజులకు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఈ సాళ్ల వేయడం వలన బెట్ట సమయంలో పంటకు నీటి సంరక్షణకు ఉపయోగపడటమే గాక అధిక వర్షం కురిసినప్పుడు మురుగు నీరు పోయే కాలువలుగా ఉపయోగపడుతాయన్నారు. గత 20-25 రోజులుగా జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో రైతులు ఆగస్టు మాసంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలన్నారు. వర్షాధార ఎర్రనేలల్లో కంది, జొన్న, కొర్ర, సజ్జ, అలసంద, ఉలవ, ఆముదం, పెసర, అనుముల పంటలు వేసుకోవచ్చన్నారు. నల్లరేగడి నెలల్లో కంది, ఆముదం, పత్తి పంట, ఆగస్టు మొదటి వారం వరకు సాగు చేసుకోవచ్చునని సూచించారు.

సూపర్‌స్పెషాలిటీలో అరుదైన శస్త్రచికిత్స



కోలుకున్న ట్రాన్స్‌జెండర్‌తో వైద్య బృందం

అనంతపురం టౌన్, జూలై 30: ఓ ట్రాన్స్‌జెండర్‌కు అరుదైన శస్త్ర చికిత్స చేసి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ప్రాణాలు నిలిపారు. వివరాలను సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ భాస్కర్ మంగళవారం వెల్లడించారు. ఈనెల 25న అనంత సర్వజన ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో ఉరవకొండకు చెందిన స్వాతి అనే 40ఏళ్ల ట్రాన్స్‌జెండర్ తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఇటీవల కిందకు పడ్డానని అప్పటినుంచి కళ్లు తిరగడం తలతిరగడం, భరించలేక తలనొప్పితో ఇబ్బంది పడుతున్నానని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలతకు తెలిపారు. దీంతో వారు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి పంపించి న్యూరోసర్జరీ డాక్టర్లతో పరీక్షలు చేయించారు. తలకు తగిలిన గాయం వల్ల మెదడులో ఇరువైపులా రక్తస్రావం జరిగి ఒత్తిడి పెరగడంతో తలతిరగడం, తలనొప్పి వస్తున్నాయని గుర్తించారు. ఇది చాలా అరుదుగా సంభవిస్తుంటుందని, శస్త్ర చికిత్స చేయాలని, లేదంటే ప్రాణానికి ముప్పు ఉంటుందని, బయట చేయించుకుంటే రూ.ఆరు లక్షలు అవుతుందని డాక్టర్లు తెలిపారు. అంతఖర్చు భరించలేనని ట్రాన్స్‌జెండర్ చెప్పడంతో సూపర్‌స్పెషాలిటీ న్యూరోసర్జరీ హెచ్ఓడీ డాక్టర్ భాస్కర్, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కరబాబు, డాక్టర్ అచ్యుత్ అనస్తీషియా డాక్టర్లు రీనా, మధు తదితరులు ఈనెల 27న శస్త్ర చికిత్స చేశారు. అది విజయవంతం కావడంతో ఆమె ఆరోగ్యంగా కోలుకున్నారు. అరుదైన ఆపరేషన్ చేసి ఓట్రాన్స్ జెండర్ ప్రాణం కాపాడినందుకు సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జరీ విభాగం డాక్టర్లను సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు అభినందించారు.

టీబీ డ్యాంలో 101 టీఎంసీల నిల్వ



నీటితో తొణికిసలాడుతున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్, జూలై 30: తుంగభద్ర జలాశయంలో 101.890 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు మంగళవారం సాయంత్రం తెలిపారు. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లోని శివమొగ్గ, అగుంబే, శృంగేరి, చిక్కమంగళూరు వర్నాడు తదితర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఇన్‌ఫ్లో తగ్గింది. సోమవారం 1,31,179 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి 68,630 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో మొత్తం 33 క్రస్టుగేట్లలో 12 గేట్లు మాత్రమే రెండు అడుగులు మేర ఎత్తి 40,160 క్యూసెక్కులు తుంగభద్ర నదికి, 9553 క్యూసెక్కులు కాలువలకు విడుదల చేశారు. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 107.788 టీఎంసీలు ఉండగా మంగళవారం సాయంత్రానికి 1632.03 అడుగులతో 101.890 టీఎంసీల నీటి నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 1210 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

రేపటి నుంచి హంద్రీనీవాకు నీరు



అనంతపురం క్లాక్ టవర్, జూలై 30: హంద్రీనీవాకు ఆగస్టు ఒకటిన నీటి విడుదల చేయనున్నట్లు కేఆర్ఎంబీ ప్రకటించిందని జిల్లా జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. నీటి విడుదల కోసం జలవనరుల శాఖ జిల్లా సీఈ నాగరాజ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో 883అడుగుల మేర 204టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో మల్యాల నుంచి రెండు పంపుల ద్వారా కృష్ణా జలాలను హంద్రీనీవాకు విడుదల చేయనున్నారని తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లో మూడు లక్షల క్యూసెక్కులకుపైగా ఉందన్నారు. ఒకటిన మొదట మల్యాల నుంచి వెయ్యి క్యూసెక్కుల ప్రకారం హంద్రీనీవా కాలవకు నీరు వదలనున్నారని తెలిపారు. నీరు వదిలిన సమయం నుంచి ఐదురోజుల్లో కృష్ణా జలాలు జిల్లా సరిహద్దుల్లోకి చేరుతాయన్నారు. ఈ ఏడాది హంద్రీనీవాకు పూర్తి స్థాయి కేటాయింపులు 40టీఎంసీలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రబాబు

ధర్మవరం, జూలై 30: గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలని ఆ సంఘం జాతీయ నాయకుడు నరేంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం జగ్జీవన్‌రాం నగర్‌లోని రాముని దేవాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీంకోర్టు త్వరలోనే ఒక తీర్పు ఇవ్వనున్న సందర్భంగా ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు బూదెప్ప, చిల్లవారిపల్లి శివయ్య, ఎంఎస్‌పీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు బండారు కదిరెప్ప, జిల్లా అధికార ప్రతినిధి నాగభూషణం, ధర్మవరం నాయకులు గజ్జల రామాంజినేయులు, నాగరాజు, సుధాకర్, రామకృష్ణ, నాగేపల్లిబాబు, రమేశ్, నాగేంద్ర, ఆదినారాయణ, పుల్లప్ప, ప్రకాశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మురుగు తొలగింపు



ఓడీసీలో మురుగునీటి కాలువను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఓబుళదేవరచెరువు, జూలై 30: స్థానిక చెరువు ప్రాంతంలో మురుగునీటి కాలువలో పేరుకుపోయిన పూడికను పంచాయతీ అధికారులు మంగళవారం శుభ్రం చేయించారు. గ్రామాల్లోని మురుగు కాలువల్లో పూడిక పేరుకపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై రెండు రోజులక్రితం కంపుకొడుతున్న పల్లెలు శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన కార్యదర్శి రామలింగారెడ్డి, సర్పంచ్ గోవిందు, పంచాయతీ సిబ్బందితో స్థానికచెరువు ప్రాంతంలో మురుగునీటి కాలువలను శుభ్రంగా చేయించారు.



మల్లాపల్లిలో..

జలధికి తరలిన పీర్లు

ఓబుళదేవరచెరువు, జూలై 30: మండలంలోని మిట్టపల్లి పంచాయతీలోని మల్లాపల్లిలో మంగళవారం ఘనంగా మొహరం జలధి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిగుండం చుట్టూ యువత కేరింతలతో అల్లావు తొక్కుతూ భక్తిని చాటుకున్నారు. చివరిసారిగా పీర్లను భక్తులు దర్శించుకుని చక్కెర చదివించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపుగా పీర్లు జలధికి తరలించారు.

తాడిమర్రి: మొహరం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చిన్న పీర్ల పండుగను తాడిమర్రిలో ఘనంగా నిర్వహించారు. పీర్లస్వాములను అందంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అగ్నిగుండ ప్రవేశం చేయించారు. స్వాములను సాయంత్రం వరకు గ్రామంలో ఊరేగించిన అనంతరం జలధి నిర్వహించారు. ఈ సందర్భంగా ముల్లాసాబ్‌లు భక్తిశ్రద్ధలతో చక్కెర చదివింపులు చేశారు.



తాడిమర్రిలో జలధికి వెళ్తున్న పీర్లస్వాములు

పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

గాండ్లపెంట, జూలై 30: మండలంలోని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ ఆంజనప్ప సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి నుంచి గ్రామం చివర వరకు ఉన్న మురుగుకాలువను ఆయన మంగళవారం పరిశీలించారు. మురుగు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లాలని కార్యదర్శి బాషా, సర్పంచ్ రహంతులాకు సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓడీఎఫ్ సర్వేని వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈఓఆర్‌డీ సునీత, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

నల్లమాడ, జూలై 30: మండలంలోని పాతబత్తలపల్లి ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా డీఎంఅండ్‌హెచ్ కార్యాలయ టాస్క్‌ఫోర్సు అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. గర్భవతులు, విద్యార్థులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో జిల్లా ఇమ్యునైజేషన్ డాక్టర్ నాగేంద్ర నాయక్, డాక్టర్ దీపికారెడ్డి, డీపీఓ నాగరాజు, ఎస్‌ఓ ఖలందర్, డీపీహెచ్‌ఓ వీరమ్మ, ఐడీ ఎస్పీ వింగ్ సుబ్బారావు, సీహెచ్‌ఓలు రామాంజులు, కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్లు మంజుల, ఎస్ మహబూబ్‌బాషా, ఏఎన్ఎం శ్రీలత, ఆశ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయానికి విరాళం

కదిరి(అమడగూరు), జూలై 30: స్థానిక చౌడేశ్వరి ఆలయానికి బెంగళూరు నగరంలోని సంతికేనగర్ ఎలక్ట్రానిక్ సిటీ నివాసులు నారాయణస్వామి, కళావతమ్మ వస్తుసామగ్రిని విరాళంగా అందించారు. మంగళవారం కుర్చీలు, షామియానాలు, టేబుళ్లు, కార్పెట్‌ను ఆలయ కమిటీ ధర్మకర్త పొట్లా పురుషోత్తమరెడ్డికి అందజేశారు.

వేరుశనగకు ఆకుమచ్చ తెగుళ్లు

కదిరి, జూలై 30: ముదిగుబ్బ మండలంలోని గుంజేపల్లి గ్రామంలో వేరుశనగ పంటకు ఆకుమచ్చ తెగుళ్లు సోకినట్లు వ్యవసాయ శాఖ ఏడీ సత్యనారాయణ తెలిపారు. మునెప్ప, వంగమేష్‌చౌదరి సాగుచేసిన వేరుశనగ, కంది పంటలను మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. వేరుశనగలో కె-6 రకంలో ఆకుముడత, తిక్కఆకుమచ్చ తెగుళ్లు ఆశించాయన్నారు. ఆకుముడత నివరణకు లీటర్ నీటికి క్లోరోపైరీపాస్ 2.5 మిల్లీలీటరు లేదా ప్రోపేనో పోస్ 2 మి.లీ., మ్యాంకోజేప్ 3గ్రా. లేదా హెక్సాకోనోజోల్ 2మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. వేరుశనగ పూత దశలో ఉండడంతో రెండువందల కిలోలు జిప్సమ్ వేస్తే దిగుబడులు పెరుగుతుందన్నారు.

ఒకే రాత్రి నాలుగు చోట్ల చోరీ

గాండ్లపెంట : మండల కేంద్రంలో సోమవారం రాత్రి దుండగులు వరసగా నాలుగు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో గుజీరి దుకాణంలో సామన్లు, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణం వద్ద ఉన్న ట్రాక్టర్ సమన్లు, అలాగే ఆర్ఎంపీ వైద్యశాలలోని రెండు సిలిండర్లను ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న బీబీజాన్ ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలో గాలించారు. విలువైన వస్తువులు ఏవీ లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న ఎస్ఐ క్రిష్ణవేణి ఆ ప్రాంతాలను పరిశీలించింది. గుజీరీ దుకాణ యజమాని మహమ్మద్‌రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

పుట్టపర్తి రూరల్, జూలై 30: మండలంలోని అటవీప్రాంతంలో ఉన్న అమగొండపాల్యెం ప్రాథమిక పాఠశాలలోని 40 మంది చిన్నారులకు పుట్టపర్తి గోవింద పేటకు చెందిన చందన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు చందన మంగళవారం నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్స్‌ను అందచేశారు. తన తండ్రి రమేష్ జ్ఞాపకార్థం తనవంతు సేవగా చిన్నారులకు పుస్తకాలు అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖిద్మత్-ఏ-ఖల్క్ చారిటబుల్ ట్రస్టు షామీర్, వెంకటేసు, విష్ణు, భరత్, తరుణ్, ఉపాధ్యాయులు శివ పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న చందన

అసంపూర్తిగా విలేజ్ క్లినిక్‌లు

- నాలుగేళ్లయినా పూర్తిగాని నిర్మాణాలు
- అద్దె భవనాల్లో వైద్య సేవలు..
- అరకొర సౌకర్యాలతో సిబ్బంది పాట్లు



కురుమాలలో పునాదులకే పరిమితమైన భవన నిర్మాణం

నల్లమాడ, జూలై 30: మండల కేంద్రాలు, దూర ప్రాంతాలకు వైద్య కోసం వెళ్లకుండా.. గ్రామీణులకు పల్లెల్లోనే వైద్య సేవలు అందిస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా విలేజీ క్లినిక్‌ల ఏర్పాటును ప్రారంభించింది. అందులో ఒక డాక్టర్, ఒక స్టాఫ్‌నర్స్, సిబ్బందిని ఏర్పాటు చేసి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందిస్తామని ప్రగల్భాలు పలికింది. అందులో భాగంగా మండలానికి మొత్తం 13 విలేజ్ క్లీనిక్‌లను మంజూరు చేసింది. సుమారు నాలుగేళ్ల క్రితం వాటి నిర్మాణాలకూ శ్రీకారం చుట్టింది. అందులో యర్రవంకపల్లి, వేళ్లమద్ది, నల్ల శింగయ్యగారిపల్లిలో మాత్రమే భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన పది భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి. నల్లమాడ 1, 2, 3, కురుమాల, పులగంపల్లి, దొన్నికోట, గోపేపల్లి, వంకరకుంట, ఎన్ బడవాండ్లపల్లి, చారుపల్లిలో నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయాయి. బిల్లులు సరిగా రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆ నిర్మాణాలు ఆపేసినట్లు సమాచారం. దీంతో గ్రామీణులకు వైద్య సేవలు అందడం లేదు. వైద్యసిబ్బంది ఆయా పంచాయతీ గ్రామాల్లో అద్దె భవనాల్లో కొంతమంది, ఆర్డీటీ కార్యాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలలో మరికొంతమంది గ్రామీణులకు వైద్య సేవలం దిస్తున్నారు. వైద్య సిబ్బంది అద్దెలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. నల్లమాడ 1 సచివా లయ పరిధిలోని విలేజీ క్లినిక్ పాఠశాల భవనం లోను, నల్లమాడ 2, 3, కురమాల, పులగంపల్లి విలేజీ క్లీనిక్‌లో ఆర్డీటీ కార్యాలయాల్లో వైద్య సేవ లందిస్తున్నారు. దొన్నికోటలో అద్దె భవనంలో, గోపేపల్లి, వంకరకుంట, చారుపల్లి సచివాలయాల విలేజీ క్లినిక్‌లో చికిత్సలు అందిస్తున్నారు. పాత బత్తపల్లిలో పంచాయతీ భవనంలో వైద్యసేవలం దిస్తున్నట్లు సమాచారం. 13 సచివాలయాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ప్రతిరోజు ఉదయమే రెడ్డిపల్లి ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడ వ్యాక్సిన్ తీసుకుని, అక్కడ నుంచి సచివాలయాలకు వెళ్లాల్సి ఉంది. కొన్ని సచివాలయాలు 15 కిలోమీటర్లు దూరం ఉండడంతో వెళ్లడానికి బాగా అలస్య మవుతోంది. తమకు అరకొరగా వైద్య సేవలం దుతున్నట్లు రోగులు వాపోతున్నారు. విలేజీ క్లినిక్ భవనాలు లేకపోవడంతో, అరకొర సౌకర్యాలున్న అద్దెభవనాల్లో చికిత్సలు అందిస్తు న్నామని వైద్యులు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో ఆ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు సరిగా అందించ లేకపోతున్నామన్నారు. నూతన కూటమి పాలకులు స్పందించి.. అర్ధంతరంగా ఆగిపోయిన విలేజ్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తయ్యేలా... మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.



దొన్నికోటలో ఆగిపోయిన నిర్మాణం



పూర్తికాని నల్లమాడ-3 భవన నిర్మాణం

గ్రామీణులకు మెరుగైన వైద్యం

- ముదిగుబ్బ పీహెచ్‌సీని సీహెచ్‌సీగా చేస్తా
- భవన నిర్మాణాలను పూర్తి చేయిస్తాం
- వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి

ముదిగుబ్బ, జూలై 30 : గ్రామీణ ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ముదిగుబ్బలోని పీహెచ్‌సీను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డుల్లో తిరుగుతూ రోగులతో మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో ఓపీ రికార్డులను పరిశీలించి, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లా డుతూ.. జనాభా ఎక్కువగా ఉన్న ముదిగుబ్బ పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు చేస్తామన్నారు. ఆసుపత్రుల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది కూడా తా ము చేస్తున్నది ఉద్యోగం కాదు, సేవ అనే విషయాన్ని మర్చిపోకూడదన్నారు.

వాటర్ సంపును ప్రారంభించిన మంత్రి : సంకేపల్లి సమీపంలో నూతనంగా నిర్మించిన వాటర్ సంపును మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. సుమారు రూ.66 లక్షల ఎన్‌హెచ్ఏఐ నిధులతో చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి పైపులైను మార్పు, పంపు రూము, వాటర్ సంపు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, బీజేపీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, గుడిసె దేవానంద్, సంధిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఒంటేరు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ : తమ ఎనిమిది నెలల కుమారుడికి రెండు కళ్లూ కనిపించడం లేదని, రూ. మూడు లక్షలతో మదురై ఆసుపత్రిలో చికిత్సలు చేయించినా ఫలితం లేదని ముదిగుబ్బ పాతూరు గ్రామానికి చెందిన నాగార్జున, శిరీష దంపతులు మంత్రి వద్ద వాపోయారు. బాబుకు కార్పొరేట్ వైద్యం అందేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. 22ఏ నిషేధిత జాబితా చట్టాన్ని సవరించి చుక్కల భూముల సమస్యలను పరిష్కరిచాలని, ఆ భూములు రిజిస్ట్రేషన్ జరిగే విధంగా చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు మంత్రిని కోరారు. మలకవేముల క్రాస్ నందు శ్మశానవాటిక స్థలం కేటాయించాలని.. పశువుల ఆసుపత్రి, తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు మంత్రిని కోరారు. ఏబీ పల్లి తండా గ్రామంలో తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని ఆ తండా వాసులు కోరారు. ముదిగుబ్బలోని కస్తూర్బా కాలనీలో సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు చేయాలని స్థానికులు, మండల కేంద్రంలో ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం ఏర్పాటు చేయాలని యువకులు, వైద్య సిబ్బంది జీతాలు పెంచాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆసుపత్రి సిబ్బంది మంత్రికి వినతి పత్రాలు అందించారు. మండల కేంద్రంలో శాఖా గ్రంథాలయం ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని గ్రంథాలయ సిబ్బంది వినతిపత్రం అందించగా.. స్పందించిన మంత్రి మండల నిధుల నుంచి రూ. రెండు లక్షలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



వెంకటేష్

ముదిగుబ్బ, జూలై 30: నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు స్థానిక పీవీఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వెంకటేష్ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు మంగళవారం తెలిపారు. వెంకటేష్ అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం తమ పాఠశాలకే గర్వకారణమన్నారు. వెంకటేష్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు క్రీడలలో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థి వెంకటేష్‌కు పాఠశాల తరఫున చైర్మన్ రూ. ఐదు వేలు, 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రూ. ఏడు వేలు ఆర్థిక సాయం చేశారు.

గ్రామీణ బ్యాంక్‌లో సాంకేతిక లోపం

నంబులపూలకుంట, జూలై 30: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులు సోమవారం నుంచి సాంకేతిక సమస్యల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంక్ ఖాతాలో డబ్బులున్నా... వాటిని తీసుకోలేక పోతున్నామని ఖాతాదారులు వాపోతున్నారు. మొబైల్ బ్యాంకింగ్, ఫోన్‌పే, గుగూల్‌పే.. కూడా పనిచేయపోవడంతో లావాదేవీలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానిక బ్యాంక్ మేనేజర్ పిచ్చయ్యను అడుగగా.. రీజనల్ మొత్తం బ్యాంక్‌లో సాంకేతిక లోపముందన్నారు.



ధర్మవరం, గొట్లూరులో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కోటగడ్డ పెద్దమ్మ, గంగమ్మతల్లికి బోనాలు

ధర్మవరం, జూలై 30: స్థానిక యాదవవీధికి చెందిన మహిళలు ఆషాఢ మాసం.. మంగళవారం సందర్భంగా కొటగడ్డ పెదమ్మ దేవికి బోనాలు సమర్పించారు. బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా పెద్దమ్మ అలయానికి వెళ్లారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయాల ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పెనుకొండ నారాయణమ్మ, రాంప్రసాద్, కృష్ణవేణి, ఆలయ కమిటి సభ్యులు లక్ష్మణ్, చంద్ర, వేదప్రసాద్, లావణ్య, మల్లిక పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండల పరిధి గొట్లూరు గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం సందర్భంగా గంగమ్మతల్లికి బోనాలు సమర్పించారు. బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. భక్తి శ్రద్ధలతో అక్కడ అమ్మకు బోనాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సాంబశివ (ఫైల్)

కొత్తచెరువు/చెన్నేకొత్తపల్లి, జూలై 30: కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామానికి చెందిన సాంబశివ (23) చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లి గ్రామ సమీపంలోని పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మంగళవారం మరణించాడు. ఇతను కాంట్రాక్టు కింద ప్రతినెలా విద్యుత్ బిల్లులు రీడింగ్ తీసేవాడు. చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లి గ్రామానికి చెందిన ఎరువుల అంగడి యజమాని శ్రీకాంత్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలో విద్యుత్ సమస్య ఉంటే మరమ్మతుల కోసం సాంబశివను తీసుకెళ్లాడు. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేసిన అనంతరం ఫీజ్ వేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి సంఘటన స్థలం నుంచి పారిపోయాడు. పక్క పొలాల్లోని రైతులు గమనించి.. సాంబశివ కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అతని తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నాడు. సాంబశివకు వివాహం కాలేదు.

స్త్రీనిధి రుణాల మంజూరులో నిర్లక్ష్యం



సమస్యను వివరిస్తున్న లలితాంబిక మహిళాసంఘం సభ్యులు

నంబులపూలకుంట, జూలై 30: పొదుపు సంఘాలకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని ధనియాన్ చెరువుకు చెందిన లలితాంబిక మహిళాసంఘం సభ్యులు వాపోతున్నారు. స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలను గత మాసంలోనే చెల్లించామనీ, 20 రోజుల క్రితం కొత్తరుణాలు స్త్రీనిధి కింద మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నా ఏపీఎం స్పందించలేదని అన్నారు. ధనియాన్‌చెరువు, మేకలచెరువు, ఎదురొన్న క్లస్టర్ పరిధిలో 203 సంఘాలున్నా.. 45 సంఘాలు స్త్రీనిధి కోసం దరఖాస్తు చేసుకున్నాయని, ఆ సభ్యులు రుణాల కోసం ఎదురు చూస్తున్నారని సభ్యులు రమాదేవి, సావిత్రి, రాధ వాపోతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఏపీఎం రమణప్పను అడగ్గా.. స్త్రీనిధి మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే రుణాలు మంజూరు చేస్తామన్నారు.

మానవ అక్రమ రవాణా అమానవీయం



మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

కదిరి లీగల్, జూలై 30: మానవ అక్రమ రవాణా అమానవీయం, అనాగరికమని కదిరి న్యాయాధికారులు పేర్కొన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం ఓ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ న్యాయాధికారి ఎస్. జయలక్ష్మి హాజరయ్యారు. సదస్సులో అక్రమ రవాణా అయి.. నరకయాతన అనుభవించి ఆ చెర నుంచి విముక్తి పొందిన పలువురు మహిళలు తాము పడిన బాధలు వివరించారు. అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తామే ముందుండి పోరాడుతామన్నారు. అనంతరం న్యాయాధికారులు మాట్లాడుతూ.. ఈ సామాజిక రుగ్మతను నివారించడానికి అధికార యంత్రాంగం కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. అక్రమ రవాణాలో ప్రధానంగా మహిళలే బలి అవుతున్నారని, ఇది సమాజానికి హానికరమని అన్నారు. బాధితులు లోక్‌అదాలత్ ద్వారా న్యాయ సహాయం పొందడానికి అనేక అవకాశాలు ఉంటా యన్నారు. అనంతరం స్కూల్ పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. న్యాయాధికారులు ఎస్. ప్రతిమ, పి.మీనాక్షి సుందరి రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానూజ, న్యాయవాది లోకేశ్వరరెడ్డి, లెక్చరర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

పింఛన్లను అడ్డుకోవడం అన్యాయం

ధర్మవరం: ఎస్సీ, ఎస్టీలకు పింఛన్‌లు ఇవ్వకుండా అడ్డుకోవడం అన్యాయమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయాన్ని మడకశిర పర్యటనకు వస్తున్న సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డిపల్లి పృథ్వీ, విద్యార్థి నిరుద్యోగ పోరాట ఐక్య వేదిక వినోద్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు చిరంజీవి, రామకృష్ణ, ఓబులేసు, వెంకటేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

కదిరి, జూలై 30: పట్టణంలో రోడ్డును ఆక్రమించుకొని నిర్మించిన దుకాణాల తొలగింపులో మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇందిరాగాంధీ సర్కిల్ నుంచి టవర్ క్లాక్ వరకు ఉన్న రోడ్డును ఆక్రమించుకొని నిర్మించిన దుకాణాలను అధికారులు తొలగించే కార్యక్రమాన్ని రెండో రోజైన మంగళవారమూ కొనసాగించారు. టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న ఓ దుకాణాన్ని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు వెళ్లగా, దుకాణ యజమాని తాను చనిపోతానంటూ విషద్రావకం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. వెంటనే బంధువులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ కుటుంబ సభ్యులు వచ్చి దుకాణం తొలగించకూడదని మున్సిపల్ సిబ్బందిని నానా బుతూలు తిట్టారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ అక్కడికి వచ్చి రోడ్డును ఆక్రమించిన వారితో మాట్లాడారు. ఆ వీధి వెనుక ఉన్న గృహ యజమానులు తమకు రోడ్డు కావాలని చెప్పడంతో మున్సిపల్ కమిషనర్ ఆ దుకాణాన్ని తొలగించాలని సిబ్బందికి సూచించారు. దీంతో అక్కడున్న దుకాణాన్ని తొలగించారు. దీంతో అక్కడ కొద్దిపాటి ఉద్రిక్తత చోటుచేసుకుంది.



దుకాణదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, పోలీసులు

మాధవ గురుకులానికి ఆర్థిక సాయం

కదిరి అర్బన్ : పట్టణంలో సేవాభారతి కదిరి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాధవ గురుకుల విద్యార్థులకు గాండ్లపెంట మండలంలోని చిన్నక్కగారిపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డి రూ. 10,116 చెక్కును అందచేశారు. మంగళవారం గురుకులాన్ని సందర్శించిన ఆయన అనాథ పిల్లలను చేరదీసి, చదువుకోవడానికి అవకాశం కల్పిస్తున్న సేవాభారతి సంస్థను అభినందించారు. కార్యక్రమంలో సేవా భారతి మాజీ కార్యదర్శి చింతా శరత్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి మిత్ర బృందం కొడిగే శివప్రసాద్, వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



చెక్కు ఇస్తున్న రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అక్రమ లే అవుట్లపై చర్యలు తప్పవ్

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరిక

మడకశిరటౌన్, జూలై 30: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి, అక్రమంగా ప్లాట్లు వేసి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరించారు. మంగళవారం నగర పంచాయతీ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకో... కమిషనర్కో... డబ్బులు ఇవ్వలేదనీ... ఎవరి ప్లాట్లను ధ్వంసం చేయలేదన్నారు. అప్రూవల్ లేకపోవడంతోనే రాళ్లను తొలగిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ప్లాట్లను విక్రయించాలనీ, కొనుగోలు చేసే వారు సైతం అప్రూవల్ ఉన్న వాటినే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని, నెలలోపు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 70 శాతం పూర్తి చేసి, నీటి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కూరగాయల మార్కెట్ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు. రూ.10కోట్లు వెచ్చించి ప్రతి వార్డులోనూ డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. 15వవార్డు కౌన్సిలర్ నరసింహరాజు మెప్మాలోని ఆర్పీలు రుణ వసూలులో చేతివాటం ప్రదర్శిస్తున్నారని, దీంతో రుణాలు తీసుకొన్నవారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జూనియర్ కళాశాల ఆవరణంలో ఉన్న పెద్ద నీటి ట్యాంకును రెండు సంవత్సరాల నుంచి శుభ్రం చేయించలేదని, నీటిని తాగినవారు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఐదు సంవత్సరాలుగా ఫాగింగ్ మిషన్ను పూజకు పెట్టారా... అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టణంలో ఫాగింగ్ చేయాలని, దోమల బెడద తగ్గించాలని ఆదేశించారు. మడకశిరను అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రంగస్వామి, ఛైర్పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇంట్లో దుష్టశక్తులున్నాయంటూ మాయమాటలు

కమ్మలు, బంగారు గొలుసుతో ఉడాయింపు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 30: మండలకేంద్రంలోని సాయినగర్లో నివాసముంటున్న మమతకు మాయమాటలు చెప్పి గుర్తుతెలియని దుండగులు కమ్మలు, బంగారు గొలుసు తీసుకెళ్లారు. మంగళవారం గుర్తుతెలియని ఎవరూలేని సమయంలో వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో చెడు శక్తులున్నాయని, వాటిని దూరం చేస్తానని నమ్మబలికాడు. ఒంటిపైనున్న చైన్, కమ్మలు తస్కరించి ఉడాయించినట్లు బాధితురాలు పేర్కొంది. 100కు కాల్చేసి బాధితురాలు ఫిర్యాదు చేసింది. స్థానిక పోలీసులు సుధాకర్, హబీబ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

హిందూపురం అర్బన్, జూలై 30: ఆటో బోల్తా పడిన సంఘటనలో నలుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. మంగళవారం గోరంట్లకు చెందిన ఆశా వర్కర్ మంజుల తన సోదరుడుకి సదరమ్ క్యాంపులో ఫిట్నెస్ సర్టిఫికెట్ కొరకు ఆటోలో హిందూపురం వస్తున్నారు. మండలపరిధిలోని నందమూరి నగర్ క్రాస్ వద్ద ఆటో స్టీరింగ్ కట్ కావడంతో బోల్తా పడినట్లు బాధితులు తెలిపారు. ఆటోలో ఉన్న మంజుల అన్న రామాంజనేయులు, తమ్ముడు సంతోష్తో కలిసి హిందూపురం వస్తున్నారు. ముగ్గురికీ తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్కానింగ్, ఎక్స్రే పరీక్షల రిపోర్టులు వచ్చిన తరువాత నిర్ధారణ చేసి వైద్యచికిత్సలు అందిస్తామని, ప్రస్తుతం ప్రథమ చికిత్స అందించామని వైద్యులు తెలిపారు. వారిని హిందూపురం సీఐటీయూ నాయకులు రాము, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్ రాధ, జిల్లా కమిటీ మెంబర్ మమత, పరిగి యూనియన్ నాయకురాలు రాజమ్మ, బీబీజాన్, భారతి, యశోద అనిత, జయలక్ష్మి, సునీత, ప్రశాంతి పరామర్శించారు.

ఘనంగా మారెమ్మ దేవత ఉత్సవాలు

అగళి, జూలై 30: మండలవ్యాప్తంగా మంగళవారం మారెమ్మ దేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలూడి, నరసంబుది, రామాపురం, అగళి తదితర గ్రామాల్లో మారెమ్మ, కరియమ్మ దేవతల ఉత్సవాలు భక్తులు నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో హారతులు మోస్తూ మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో అమ్మవారు

మంత్రి ఆదేశం.. డ్రైనేజీ శుభ్రం..



డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 30: సోమందేపల్లిలోని స్నేహలతానగర్లో కొన్నేళ్లుగా అపరిశుభ్రంగా ఉన్న మురుగు కాలువకు మంత్రి సవిత ఆదేశాలతో మోక్షం లభించింది. మంగళవారం టీడీపీ టౌన్ కన్వీనర్ సూరీ, బూత్ కన్వీనర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎక్స్కవేటర్తో కాలువను శుభ్రపరిచారు. అనంతరం కాలువలకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మురుగు కాలువ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆమె కాలువల పరిశుభ్రతకు అధికారులను ఆదేశించారన్నారు. కార్యక్రమంలో లాలీసతీష్, అంజినరెడ్డి, ఓబులేసు, మన్సూర్, వసూద్, సుధాకర్, సజ్జురాయప్ప, గఫూర్, అజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు ఆనుకునే భవనాలు

లేపాక్షి, జూలై 30: విద్యుత్ ప్రమాదాలు ఇటీవల అధికంగా జరుగుతున్నా ఆ శాఖ సిబ్బంది పనితీరులో మార్పు రావడంలేదు. కొంతమంది విద్యుత్ స్తంభాలను కలుపుకుని, వాటికిందే భవనాలు నిర్మిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వాటికి అనుమతులు ఎలా ఇస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. లేపాక్షి వద్ద సబ్స్టేషన్కు ఎదురుగానే హెవీలైన్ కోసం నిర్మించిన ఇనుప స్తంభాన్ని కలుపుకుని ఒక భవనాన్ని నిర్మించారు. ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లేపాక్షిలో ఇలాంటివి చాలా ఉన్నాయనీ, ముడుపులు తీసుకుని అధికారులు మిన్నకుండిపోతున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణాలు చేపట్టకుండా ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఆనుకుని నిర్మించిన భవనం



ఘనంగా ఉజ్జయిని మహంకాళి జాతర

● అమ్మవారి జ్యోతులు మోసిన మంత్రి సవిత



పెద్దిరెడ్డిపల్లిలో జ్యోతులు మోస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, జూలై 30: పట్టణంలోని తోటగేరి వీధిలో పురాతనమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు జ్యోతులను తలపై ఉంచుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళతో కలిసి జ్యోతులు మోశారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.

హిందూపురం(పరిగి): దండు మారెమ్మ అమ్మవారి మండలపూజలో జ్యోతుల మహోత్సవం పరిగి మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి, శ్రీరంగరాజులపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సవిత హాజరయ్యారు. తొలుత కొడిగెనహళ్లిలో వెలసిన ఆంజనేయస్వామిని దర్శించుకుని అక్కడి నుంచి గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ మురళిధర్ ద్వారా పాఠశాలలోని విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దండుమారెమ్మ అమ్మవారిని పూజించి మహిళలతోపాటు జ్యోతులు మోసారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతి, ప్రవీణ్రెడ్డి, హనుమయ్య, సూర్యనారాయణ, సత్యనారాయణ, ఆనంద్, శ్రీనివాసరెడ్డి, రంగనాథ్, ఈశ్వరప్ప, చౌడప్ప, తదితర నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అవినీతి సొమ్మును రికవరీ చేయాలి: సీపీఎం



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 30: మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2023-24కుగాను చేపట్టిన పనుల్లో సామాజిక తనిఖీ బృందం నిగ్గుతేల్చిన అవినీతి సొమ్మును రికవరీ చేయాలని సీపీఎం నాయకులు పెద్దన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం అనుబంధ సంఘాల నాయకులతో కలిసి ఆయన ఆందోళన నిర్వహించారు. 925పనులకుగాను రూ.5.45కోట్లు ఖర్చు చేస్తే, పంచాయతీరాజ్ 18పనులకుగాను రూ.88.52లక్షలు ఖర్చు చేశారన్నారు. ప్రభుత్వ గృహాల బిల్లులతో కలిపి రూ.6.22కోట్లపై తనిఖీ జరిగిందన్నారు. అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా రూ.29వేలు మాత్రమే అవినీతి జరిగినట్లు వెల్లడించడం విడ్డూరమన్నారు. ఎస్ఆర్పీ చంద్రమోహన్ రూ.33లక్షలు అవినీతి జరిగినట్లు తెలిపారన్నారు. వీటిపై సమగ్ర నివేదికను ప్రజల ముందుంచాలన్నారు. ప్రభుత్వ గృహాల్లో పండ్లతోటల పెంపకంలో ఫారంపాండ్స్, పెన్షన్ తదితర వాటిపై జరిగిన అవినీతిపై ప్రజావేదిక జరిగి వారం రోజులైనా రికవరీ చేయలేదని ప్రశ్నించారు. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వకపోతే ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమయ్య, వెంకటేశులు, గోవిందప్ప, కిష్టప్ప, నాగరాజు, మాబు, నాగభూషణ, రామాంజనేయులు, నజీర్, షబ్బీర్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అగళి, జూలై 30: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికల అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అగళి, రొళ్ల, మండలంలోని బాలికలు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. లాంగ్జంప్, రన్నింగ్రేస్, షాట్పుట్, పోటీల్లో విజేతలైన బాలికలకు గోల్డ్మెడల్తోపాటు బహుమతులను కూడా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీంద్రమూర్తి, ఆర్డీటీ ఏటీఎల్ మల్లికార్జున, ఓబులేసు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇరిగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నవ్య, అంజలి, అంకిత, జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు రవీంద్రమూర్తి, పాఠశాల సిబ్బంది టీడీపీ సర్పంచ్ లక్ష్మమ్మ, లింగరాజు అభినందించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

అగళి, జూలై 30 : మండలంలోని పి.బ్యాడిగెర గ్రామంలో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి ఫణిరాజ్ ఆధ్వర్యంలో చేపట్టారు. జాతీయ రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం, ముళ్లకంపలను తొలగించి శుభ్రం చేశారు. దోమలు ప్రబలకుండా కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. ఇళ్ల ముందు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎన్టీఏను రద్దు చేయాలి: ఏఐఎస్ఏ

పెనుకొండ, జూలై 30: కేంద్ర ప్రభుత్వం పరీక్షల దోపిడీని అరికట్టాలని, ఎన్టీఏ (జాతీయ పరీక్షల ఏజెన్సీ)ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో స్టూడెంట్స్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసా రాష్ట్ర అధ్యక్షుడు వేమన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఏ నిర్వహిస్తున్న ప్రతి పరీక్షల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. పేపర్ల లీక్, పరీక్ష రద్దు, మాస్ కాపీయింగ్ లాంటి అనేక సమస్యలకు ఎన్టీఏ కారణమన్నారు. ఎన్టీఏ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్స్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 9న ఆల్ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేష్, మండల అధ్యక్షుడు అనీల్, నాయకులు రాజేష్, ఆది, మంజునాథ్, పునీత్, హమీద్, శ్రీరామ్, సురేష్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్లో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఏ నాయకులు

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గురుమూర్తి



బీఎస్ గురుమూర్తిని సత్కరిస్తున్న సంఘం సభ్యులు

గుడిబండ, జూలై 30 : రాష్ట్ర బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శిగా బీఎస్ గురుమూర్తిని ఎంపిక చేశారు. సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర బ్రాహ్మణ సంఘం సమావేశంలో మడకశిర నియోజకవర్గం హెచ్టీ హళ్లి గ్రామానికి చెందిన గురుమూర్తిని ఎంపిక చేసినట్లు బ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. గురుమూర్తికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించి బ్రాహ్మణ సంఘం నామినేటెడ్ పదవుల్లో ఛైర్మన్గా నియమించాలని వారు కోరారు. ఆయన ఎంపిక పట్ల బ్రాహ్మణ సంఘం నాయకులు రవిస్వామి హర్షం వ్యక్తం చేశారు.

విద్యతోనే అభివృద్ధి: ఎంఈఓ



నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రవిచంద్రకుమార్

గుడిబండ, జూలై 30: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎంఈఓ రవిచంద్రకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లురొప్పం, మైనగానపల్లి, రాళ్లపల్లి, ముదిగుబ్బ, ఎస్ఆర్రొప్పం తదితర గ్రామాల్లో గాయత్రి సిల్క్స్, బెంగళూరువారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగులు, పెన్నులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగరాజు, కరియప్ప, సోమశేఖర్రెడ్డి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్కార్పియో వాహనం అపహరణ

పెనుకొండ టౌన్, జూలై 30: పట్టణంలో స్కార్పియో వాహనం చోరీకి గురి అయ్యింది. బ్రిలియన్స్ కాన్వెంట్ సమీపంలో సోమవారం రాత్రి స్కార్పియో వాహనం చోరీ అయినట్లు యజమాని నరేష్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్రిలియన్స్ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నానని, ఇంటి ముందు ఎప్పటిలాగే వాహనం ఆపి ఇంట్లో నిద్రిస్తున్నానని మంగళవారం ఉదయం చూసేసరికి వాహనం చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం

మడకశిర రూరల్, జూలై 30: మండల వ్యాప్తంగా ఆగస్టు1న పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల పరిపాలన అధికారి ఆరాధ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 8,939 మందికి రూ.3.78 కోట్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గుండుమల పరిధిలో 398 మందికి రూ.16.87 లక్షలు వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

'విద్యార్థులు మొక్కలు నాటాలి'

పావగడ, జూలై 30: మొక్కలు నాటడం ప్రతి విద్యార్థి జీవితంలో అలవర్చుకోవాలని సూరప్పనేని విద్యాసాగర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విద్యాసాగర్ సూచించారు. మంగళశారం నాగలమడకలోని బోళరాయ చెరువు ప్రాంతంలో గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ద్వారా మనం ఎన్నోఉపయోగాలు పొందుతున్నామని, అందుకే ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చిన్నతనం నుంచే మొక్కలు నాటడం, సీడ్బాల్స్ విసరడం అలవర్చుకోవాలని అటవీశాఖ అధికారి శివప్ప తెలిపారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాసంస్థ కార్యదర్శి ఎన్సీ నాగభూషణ్, సెమివృక్షసమితి అధ్యక్షులు లోకేష్, పీడీఓ హనుమంతరాయప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ట్రస్టు సభ్యుడు విద్యాసాగర్

అస్వస్థతతో వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం, జూలై 30: మండలంలోని రెడ్డిపల్లిలో చౌడేశ్వరి అమ్మవారి బోనాల వేడుకలలో పాల్గొన్న సేవకుడు రామాంజనేయులు(49) అనంతరం ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. చౌడేశ్వరి అమ్మవారికి కొన్నేళ్ల నుంచి రామాంజనేయులు, దోసయ్య సేవలు అందిస్తున్నారు. ఉత్సవాల్లో అమ్మవారిని స్తుతిస్తూ విన్యాసాలు చేస్తారు. ఛాతీపై కత్తులతో పొడుచుకుంటూ అమ్మవారికి రక్తతర్పణం చేస్తారు. గ్రామంలో బోనాల ఉత్సవం మంగళవారం జరిగింది. ఈ ఊరేగింపులో ఎప్పటిలాగే రక్తతర్పణం చేసిన రామాంజనేయులు.. నీరసించి.. ఇంటికి వెళ్లాడు. కాసేపటి తరువాత ఛాతీలో నొప్పి ఎక్కువగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకి తరలించారు. మృతిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు చంద్రన్న పండుగ

● కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
● మాజీ ఎమ్మెల్సీ గుండుమల



మాట్లాడుతున్న గుండుమల

మడకశిరటౌన్, జూలై 30: మండలంలోని గుండుమలలో గురువారం 'చంద్రన్న పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి టీడీపీ అభిమానులు తరలి రావాలని టీడీపీ నాయకులు గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం బాలాజీనగర్లోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులకు పెంచిన రూ.వెయ్యి రూపాలయ పింఛన్ స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందజేస్తారన్నారు. 'చంద్రన్న పండుగ' కార్యక్రమాన్ని గుండుమల పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. 2014 సంవత్సరంలో సైతం నవ్యాంధ్రప్రదేశ్కు ముఖ్యమంత్రి ఉన్న నారా చంద్రబాబునాయుడు, రాష్ట్రం గడ్డు పరిస్థితులతుల్లో ఉన్నా రూ.వెయ్యిం పెంచారన్నారు. ఆనాడు సైతం గుండుమల పంచాయతీ వ్యాప్తంగా చంద్రన్న పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారని, మరోసారి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడం, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.వెయ్యి పింఛన్ పంపిణీ కార్యక్రమం గుండుమలతో నిర్వహించడం హర్షణీయమన్నారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేయడంతోపాటు, పండుగను ఘనంగా నిర్వహించుకొని ఆయన రుణం తీర్చుకొనే విధంగా ప్రజలందరూ కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రేపు 8,287 మందికి పింఛన్లు

గుడిబండ, జూలై 30: మండలంలోని అన్ని గ్రామాల్లో దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, డప్పు కళాకారులకు పింఛన్ల పంపిణీకి యంత్రాంగం సిద్ధం చేసింది. గురువారం 8,287మందికి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ బంగారమ్మ, ఏఓ నారాయణప్ప ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీన వంద శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వాహనాలు ఢీకొని ఎలుగుబంటి, జింక మృతి

పావగడ, జూలై 30: పట్టణ సమీపంలోని కడుమల కుంట గ్రామంవద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనాలు ఢీకొని ఎలుగుబంటి, జింక మృతి చెందాయి. అటవీశాఖ అధికారి రాకేష్ తెలిపిన వివరాల మేరకు రాత్రి సమయంలో మేత, నీటి కోసం జీవాలు సంచరిస్తున్న సమయంలో భారీ వాహనాలు ఢీ కొని అవి అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. పశువైద్యాధికారి రామాంజనేయులతో కలిసి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేశామన్నారు. మృతిచెందిన ఎలుగుబంటి, జింకను అటవీశాఖ కార్యాలయం పక్కన దహనం చేసినట్లు తెలిపారు.

సచివాలయానికి ఫొటోల అందజేత



పీఎం, సీఎం, డీసీఎం ఫొటోలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర(అమరాపురం), జూలై 30: మండలంలోని ఆలదపల్లి పంచాయతీ సచివాలయానికి మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ ఫొటోలను తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మంజుతారక్ పంచాయతీ కార్యదర్శి గౌరమ్మకు అందించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణేష్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మంజుతారక్, ఎంపీటీసీ అభ్యర్థి రామకృష్ణ, మాజీ సర్పంచి పాండురంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

హిందూపురం, జూలై 30: హిందూపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీకాంత్రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు జరగనున్న ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులతోపాటు అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

నేతన్న ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 30: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు రాజశేఖర్.. కుటుంబ కలహాలతో మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... గోరంట్లలో చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్న రాజశేఖర్ తరచూ భార్యతో గొడవ పడేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని పొలాల వద్దకు వెళ్లి విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియో ద్వారా బంధువులకు తెలిపాడు. వెంటనే బంధువులు అక్కడికి చేరుకుని, అస్వస్థతకు గురైన రాజశేఖర్ను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు. గోరంట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు.

జలధికి తరలిన పీర్లు

పెనుకొండ రూరల్, జూలై 30 : మొహరం పండగను పురస్కరించుకుని మండలంలోని చిన్నప్పరెడ్డిపల్లి గ్రామంలో పీర్లస్వాములను మంగళవారం జలధికి తరలించారు. పండగ సందర్భంగా గ్రామంలో పీర్ల గుండంను ఏర్పాటుచేశారు. పీర్లస్వాములను అగ్నిగుండం ముందు ప్రవేశపెట్టి చిన్నారుల నుంచి పెద్దల వరకు అలావు తొక్కారు. చక్కెర చదివింపుల అనంతరం పీర్లను జలధికి తరలించారు.

గోరంట్ల: మండలంలోని బాచేన్నపల్లి, ఎగువ గంగమ్మపల్లి, కరావులపల్లి తండా, నారసింహపల్లి, పులేరు గ్రామాల్లో మంగళవారం పీర్లను జలధికి తరలించారు. గ్రామాల్లోని చావిడిలో నిలిపిన పీర్లను నిత్యం పూజిస్తూ, అగ్ని గుండం ఏర్పాటు చేసి యువత కేరింతలతో అల్లావు తొక్కారు. చివరి రోజు పీర్లను ఊరేగిస్తూ హిందూముస్లింలు జలధికి తరలించారు. గ్రామాల్లో మహిళలు పీర్లకు చక్కెర చదివింపులు చేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం: ఎంపీడీఓ



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ బంగారమ్మ

గుడిబండ, జూలై 30: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ బంగారమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గుడిబండ ఎస్సీకాలనీలో ప్రజలతో ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుని ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. అపరిశుభ్రత కారణంగా డెంగీ, మలేరియా వ్యాధులు సోకుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం దోమలు ప్రబలకుండా మురుగు కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న కాలంలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. బయటి తినే పదార్థాల పట్ల జాగ్రత్త వహించాలని, తెరచివుంచిన ఆహార పదార్థాలను పిల్లలకు అందజేయరాదన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సౌందర్య, సర్పంచ్ కరుణాకర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.